సాక్షి
అనంతపురం
బుధవారం । 7 । మే । 2025



కృత్రిమ కాళ్లకు ప్రత్యేక క్యాంపు

అనంతపురం విద్యుత్‌నగర్‌లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో ఈ నెల 8న కృత్రిమ కాళ్ల ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయనున్నారు.



చీనీ టన్ను రూ.24,560

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,560 పలికాయి.



గరిష్టం/కనిష్టం
41.4°/24.2°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సజావుగా ఈసెట్



ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న సుదర్శనరావు

అనంతపురం: లేటరల్ ఎంట్రీ కింద ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈసెట్ మంగళవారం సజావుగా సాగింది. జిల్లాలో మొత్తం 2,538 మంది దరఖాస్తు చేసుకోగా, 2,448 మంది (96.45 శాతం)హాజరయ్యారు. అనంతపురంలో పరీక్ష కేంద్రాలైన ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలను ఏపీ ఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పరీక్ష నిర్వహణలో నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉతర్వులు జారీ చేసింది. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న హనుమంతరావు ఆనంద్ పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అహుడా కార్యదర్శిగా ఉన్న డిప్యూటీ కలెక్టర్ జి.గౌరి శంకర్ రావు తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా బదిలీ అయ్యారు.

'అన్నదాత సుఖీభవ' పరిశీలన ప్రారంభం



అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'అన్నదాత సుఖీభవ'కు సంబంధించి రైతు జాబితాల పరిశీలన ప్రక్రియ ప్రారంభించినట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 'అన్నదాత సుఖీభవ' కింద ఏటా ఒక్కో రైతు ఖాతాలో రూ.20 వేల చొప్పున జమ చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. 'పీఎం కిసాన్' కింద కేంద్రం ఇచ్చే రూ.6 వేలు మినహాయించి మిగతా రూ.14 వేలు మూడు విడతల్లో అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే మొదటి ఏడాది పైసా ఇవ్వకుండా దాటేసిన కూటమి సర్కారు.. తాజాగా రెండో ఏడాది 'పరిశీలన' మొదలు పెట్టడం గమనార్హం. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల ద్వారా క్షేత్ర స్థాయిలో వెబ్‌ల్యాండ్ లింక్ ఆధారంగా పరిశీలన జరుగుతోందని, అవసరమైతే తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లి పరిశీలన చేస్తున్నట్లు జేడీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. వెబ్ ల్యాండ్‌లో జిల్లాకు సంబంధించి 4,63,350 ఖాతాలు ఉన్నాయి. ఈ నెల 20 లోపు 'పరిశీలన' పూర్తి చేసి నెలాఖరుకు తుది జాబితా రూపొందించనున్నారు. జూన్ మొదటి వారంలో మొదటి విడత విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా... 2019 నుంచి 2024 వరకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా 2,87,479 మంది రైతులతో పాటు 218 మంది అటవీ భూమి సాగుదారులు, 1,419 మంది కౌలు రైతుల ఖాతాల్లో 'పీఎం కిసాన్'తో కలిపి 'రైతు భరోసా' కింద రూ.1,937 కోట్లు జమ చేసిన విషయం తెలిసిందే.



అబాసుపాలు!



అనంతపురం, శ్రీ సత్యసాయి ఎస్పీలపై సర్వత్రా విమర్శలు

- పోస్టుల కోసం శాంతిభద్రతల్ని గాలికొదిలేశారనే ఆరోపణలు
- రామగిరి హెలీప్యాడ్ ఘటనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు 71 మందిపై కేసులు
- హైకోర్టు ఆదేశాలిచ్చినా పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లనివ్వని దుస్థితి
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా పోలీసు బాస్‌ల తీరు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అనంతపురం ఎస్పీ జగదీష్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఘోర వైఫల్యం చెందారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రెడ్‌బుక్ రాజ్యాంగానికి కంకణ బద్ధులై పనిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓవైపు మట్టి, ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. మరోవైపు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోంది. మట్కా మూడుపువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగిపోతోంది. ఇవన్నీ పక్కనపెడితే టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఇంత జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్న పోలీసు బాస్‌లు.. 'పచ్చ' నేతలు చెప్పిందే వేదంగా నడుచుకుంటూ అభాసుపాలవుతున్నారనే చర్చ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగుతోంది.

ఇందుకేనా..

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య టీడీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో పాపిరెడ్డిపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా పోలీసులు పట్టించుకోలేదు. ఇది ఖాకీల మొదటి వైఫల్యం కాగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వస్తే హెలీప్యాడ్ దగ్గర జనాన్ని నియంత్రించలేక చేతులెత్తేయడం మరో వైఫల్యం. అక్కడ డీఎస్పీ స్థాయి అధికారి ఉండి కూడా 'హెలీప్యాడ్' ఘటన చోటుచేసుకోవడం రాష్ట్ర పోలీసు చరిత్రలోనే పెద్ద మచ్చగా మిగిలిపోయింది. అయితే, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రివర్స్ కేసులకు తెరలేపడం గమనార్హం. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక ఘటనలో 71 మందిపై కేసులు పెట్టడం ఇదే మొదటిసారి అని చెబుతున్నారు. జగన్ రాక సందర్భంగా వచ్చిన జనాన్ని నియంత్రించేందుకు శాయశక్తులా ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపైనా కేసుల మీద కేసులు పెట్టి వేధింపులకు తెరతీయడం గమనార్హం.




అనంతపురం ఎస్పీ జగదీష్, శ్రీ సత్యసాయి ఎస్పీ రత్న

హైకోర్టే చెప్పినా...

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రి నియోజకవర్గంలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తున్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు జరిగి ఏడాది కావస్తున్నా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ప్రస్తుత ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి పట్టణంలోకి రానివ్వకుండా కుయుక్తులు పన్నుతున్నారు. దాడులకు తెర తీస్తున్నారు. ఇటీవల స్వయానా హైకోర్టే పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించి తాడిపత్రికి పంపించాలని ఆదేశించినా పోలీసులు ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఏకంగా ఐపీఎస్ అధికారిని తాడిపత్రికి ఏఎస్పీగా వేసినా ఏమీ చేయలేని దుస్థితి. దీన్నిబట్టి తాడిపత్రిలో రౌడీరాజ్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక మాజీ ఎమ్మెల్యేకు రక్షణ కల్పించలేని దుస్థితిలో జిల్లా పోలీసులు ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా ఎస్పీ జగదీష్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. తమ పోస్టులు కాపాడుకుంటే చాలు ఏది ఏమైనా కానీ అన్న రీతిలో రెండు జిల్లాల ఎస్పీలు ముందుకు సాగుతున్నారనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. విచ్చలవిడిగా మట్కా, జూదం జరుగుతుండటం, మద్యం ఏరులై పారుతుండటం, దొంగతనాలు భారీగా పెరిగి రెండు జిల్లాల్లోనూ అధ్వాన పరిస్థితులు నెలకొన్నా పట్టించుకోని పోలీసు బాస్‌లు.. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ, ఎస్పీ జగదీష్

వజ్రకరూరు: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద ఏర్పాట్లను ఎస్పీ పి. జగదీష్‌తో కలిసి జేసీ పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో అధికారులతో సమావేశం నిర్వహించారు. హంద్రీ-నీవా ప్రధాన కాలువ బ్రిడ్జి వద్ద, హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ కేటాయించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవనాయుడు, శ్రీనివాసులు, డీపీఓ నాగరాజు నాయుడు, జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రా రెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్‌అస్లాం పాల్గొన్నారు.

'గ్రూప్–1 మెయిన్స్' కేంద్రాల పరిశీలన

అనంతపురం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. అనంతపురంలో పరీక్ష కేంద్రాలను జేసీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. 9వ తేదీతో ముగుస్తాయన్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్షకు 594 మంది హాజరుకావాల్సి ఉండగా నాల్గో రోజు 381 మంది హాజరయ్యారని, 213 మంది గైర్హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో లైజనింగ్ అధికారులు, ఎస్‌డీసీలు మల్లికార్జునుడు, తిప్పేనాయక్ ఉన్నారు.

తాడిపత్రి వెళ్తున్నా.. భద్రత కల్పించండి

- డీఐజీ, ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వినతి

అనంతపురం: హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఈ నెల 8న కుటుంబ సభ్యులతో కలిసి తాడిపత్రికి వెళ్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు భద్రత కల్పించాలని డీఐజీ, ఎస్పీకి విన్నవించారు. గత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఘర్షణల కారణంగా పెద్దారెడ్డితో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డిలు తాడిపత్రికి వెళ్లకూడదని నిబంధన విధించారు. అయితే, ఎన్నికల కౌంటింగ్ అనంతరం ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి వెళ్లారు. ఈ క్రమంలోనే కేతిరెడ్డి పెద్దారెడ్డి పట్టణానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. దీంతో పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. తాడిపత్రికి వెళ్లడానికి ఇటీవల న్యాయస్థానం అనుమతించింది.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

ఆయనకు తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఉత్తర్వులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డితో కలిసి పెద్దారెడ్డి మంగళవారం డీఐజీ డాక్టర్ షిమోషి, ఎస్పీ జగదీష్‌కు అందజేశారు. అనంతరం పెద్దారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రెండు దఫాలు జిల్లా ఎస్పీని కలిశామన్నారు. కప్పదాటు వైఖరి అవలంబిస్తూ తాను తాడిపత్రి వెళ్లకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 8న తాడిపత్రికి వెళ్లాలని నిర్ణయించుకున్నామని, భద్రత నడుమ తాడిపత్రికి పంపేలా న్యాయస్థానం ఆదేశాలను పాటించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపాల్సిన బాధ్యత జిల్లా ఎస్పీపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, మహిళా విభాగం అధికార ప్రతినిధి కృష్ణవేణి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభారాణి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శోభా భాయి, నగర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ప్రసన్న లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న విత్తన గండం

- విత్తన వేరుశనగ సేకరణపై బాబు సర్కారు మొద్దునిద్ర
- బడ్జెట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం
- ఇప్పటికే నాణ్యమైన విత్తనకాయలు వ్యాపారుల పాలు
- రైతులకు నాసిరకం విత్తనాలే గతి!

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ఈ ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తన వేరుశనగ అందే పరిస్థితి కనిపించడం లేదు. రబీలో విత్తన వేరుశనగ సేకరణపై బాబు సర్కారు మొద్దునిద్ర వహించడమే ఇందుకు నిదర్శనం. ఏటా రబీలో రైతులు పండించే వేరుశనగను ఏపీ సీడ్స్, వ్యవసాయశాఖ ద్వారా ముందస్తుగా కొనుగోలు చేసేవారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసేది. ఖరీఫ్‌లో రైతులకు రాయితీతో నాణ్యమైన విత్తనం అందించేది. అయితే, రైతుల పట్ల చిన్నచూపు ధోరణి అవలంబిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం ఈ ఏడాది ఇంకా ఆ ప్రక్రియపై దృష్టి సారించనే లేదు. ఇటీవల విత్తన సేకరణ ధర (క్వింటా రూ.9,300) ఖరారైతే చేసింది కానీ, బడ్జెట్ మాత్రం విడుదల చేయలేదు. గత ఖరీఫ్‌కు సంబంధించి ఏపీ సీడ్స్‌కు అందాల్సిన రూ.90 కోట్లు(ఉమ్మడి జిల్లా), రాష్ట్ర వ్యాప్తంగా రూ.200 కోట్ల బకాయిలు కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడం గమనార్హం.

మంచి విత్తనం దళారులపాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో 10 వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ఇటీవల పంట కోతలు కూడా మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వ నిర్వాకం కారణంగా విత్తన సేకరణ ప్రారంభం కాకపోవడంతో మంచి విత్తనం వ్యాపారుల పాలవుతోంది. కొనుగోలు చేసిన వేరుశనగను దళారులు, వ్యాపారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్‌లో రైతన్నలకు నాసిరకం విత్తనాలే దిక్కయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

విత్తన కేటాయింపుల్లో కోతలు..

ఈ సారి విత్తన కేటాయింపుల్లోనూ చంద్రబాబు ప్రభుత్వం కొర్రీలు వేసి అన్నదాతలను నిరాశపర్చింది. జిల్లాకు 1,51,978 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపగా... 54,184 క్వింటాళ్లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాకు 1.60 లక్షల క్వింటాళ్లు కావాలని ప్రతిపాదించగా 60 వేల క్వింటాళ్లకు అనుమతిచ్చారు. ఈ క్రమంలో రైతులు విత్తనం కోసం కూడా అగచాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక.. జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్) 750 క్వింటాళ్లు 50 శాతం రాయితీతో పంపిణీ చేస్తామని 15 రోజుల క్రితమే ప్రకటించారు. కానీ 750 క్వింటాళ్లకు 207 క్వింటాళ్లకు కుదించినా ఇప్పటి వరకు క్వింటా కూడా సరఫరా చేయకపోవడం చూస్తే రైతుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్య వైఖరి కనబరుస్తోందో అర్థం చేసుకోవచ్చు.



విత్తన వేరుశనగ

అన్నదాతల మండిపాటు..

రెండేళ్లుగా సరైన పంట దిగుబడులు లేవు. కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆపన్న హస్తం అందించి ఆదుకోవాల్సిన బాబు సర్కారు.. అడుగడుగునా అలసత్వం ప్రదర్శిస్తుండటంపై అన్నదాతలు మండిపడుతున్నారు. ఇప్పటికే రాయితీ విత్తన సరఫరాలో కోతలు వేసి నిరాశపర్చిందే కాక.. విత్తన సేకరణపై ఇప్పటికీ దృష్టి సారించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల నుంచి కీలకమైన ఖరీఫ్ (ముంగారు) ఆరంభం కానున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుండటంతో.. ఈ సారి విత్తన విపత్తు తప్పేలా లేదంటూ నిట్టూరుస్తున్నారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

- మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ఆర్డీటీని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్డీటీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు (ఎఫ్‌సీఆర్ఏ) రెన్యూవల్ అంశంపై మంగళవారం స్థానిక ఓ కల్యాణ మంటపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బసవరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌తో పాటు ప్రజాసంఘాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. విశ్వ మాట్లాడుతూ... కరువు పీడిత అనంతపురం జిల్లాలో ఆర్డీటీ చేపట్టిన సేవలను గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం విద్య, వైద్యం, పక్కాగృహాలు, వాటర్‌షెడ్, ఉపాధిహామీ, హార్టికల్చర్, మహిళా సాధికారితకు రూ.వందల కోట్లు ఖర్చు పెట్టారన్నారు. ఆర్డీటీ సేవలు ఆగిపోతే పేదలు నష్టపోతారన్నారు. ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 12న ఉరవకొండలో భారీ నిరసన ర్యాలీ చేపట్టేలా నిర్ణయించారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున, కృష్ణమూర్తి, అబ్బాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు బెంజిమెన్, ఏపీటీఎఫ్ హనుమప్ప, భాస్కర్, రాజేష్, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు మధుకర్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబులేసు, ఆపద్బాంధవ ట్రస్ట్ ప్రతినిధి మురళి, సర్పంచ్ జగదీష్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు ఏసీ ఎర్రిస్వామి, తిప్పయ్య, విద్యార్థి సంఘం నాయకుడు పురుషోత్తం, వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కళ నింపని కనకాంబరాలు



అనంతపురం రూరల్ మండలం పూలకుంట వద్ద కనకాంబరం పూలు విడిపిస్తున్న కూలీలు

'పంట పండితే ధరలుండవు.. ధరలుంటే పంట పండదు' అన్నట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి, రేయింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట తమకు కనీస గిట్టుబాటు కూడా మిగిల్చని దుస్థితి దాపురిస్తుండటంతో వారి ఆవేదన అంతా ఇంతా కాదు. అనంతపురం రూరల్ మండలం పూలకుంట, పసలూరు, చియ్యేడు తదితర గ్రామాల్లో రైతులు కనకాంబరం పూలు సాగు చేశారు. కాపు బాగానే ఉన్నా మార్కెట్లో సరైన ధరల్లేవు. ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.200 మాత్రమే పలుకుతుండటంతో గిట్టుబాటు కావడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కిలో కనకాంబరాలు రూ.500 నుంచి రూ.800 పలికితేనే అంతో ఇంతో మిగులుతుందని చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కంబదూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న అండేపల్లివాసులు



కుందుర్పి: తూముకుంట సచివాలయానికి తాళాలు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తారస్థాయికి దాహం కేకలు

కళ్యాణదుర్గం/కుందుర్పి: ఉమ్మడి జిల్లాలో దాహం కేకలు తారస్థాయికి చేరాయి. కడుపు మండిన జనం రోడ్లెక్కుతున్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు నిత్యం ఎక్కడో చోట వెలుగులోకి వస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తాజాగా కంబదూరు మండలం అండేపల్లిలో, కుందుర్పి మండలం తూముకుంట గ్రామంలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు ఆర్తనాదాలు పెట్టారు. 'తాగు నీరందించండి మహాప్రభో' అంటూ విన్నవించుకున్నారు. అండేపల్లివాసులు ఖాళీ బిందెలతో కంబదూరు ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. తూముకుంటవాసులు గ్రామంలో సచివాలయానికి తాళాలు వేసి గంట పాటు నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి సుమారు మూడున్నర కిలోమీటర్లు ఖాళీ బిందెలతో అండేపల్లి వాసులు ర్యాలీ నిర్వహించడం చూస్తే తాగునీటి సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీరు కూడా అందజేయని పాలకులెందుకని నిలదీశారు. శ్రీరామిరెడ్డి పథకం నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కూటమి నేతలు స్వలాభం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఎంపీపీ లక్ష్మిదేవి స్పందించి.. అండేపల్లి గ్రామంలో మరో బోరు వేసేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

క్లుప్తంగా

'భగవద్గీత' పోటీల్లో చిన్నారి ప్రతిభ


నిహాన్సారెడ్డి

అనంతపురం కల్చరల్: గణపతి సచ్చిదానంద భగవద్గీత పారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్త పోటీల్లో అనంతపురానికి చెందిన నికితేష్ రెడ్డి, సంధ్య దంపతుల కుమార్తె, 9 ఏళ్ల వయసున్న చిన్నారి నిహాన్సారెడ్డి బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఈ నెల 18న మైసూరులో జరిగే కార్యక్రమంలో పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ఆమె బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకోనుంది.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం సమీపంలో ఉన్న పద్మావతి ఆయుర్వేదిక్ కళాశాల వద్ద బళ్లారి వైపు వెళుతున్న ఓ ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడింది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఘటనలో 33 కేవీ విద్యుత్ లైన్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంతో పాటు దానికి సపోర్ట్‌గా నిలిపిన మరో స్తంభమూ కూలింది. విద్యుత్ వైర్లు కిందకు వేలాడాయి. స్థానికులు అప్రమత్తమై సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ప్రమాదంలో గాయపడిన ట్యాంకర్ డ్రైవర్ అంజాద్‌బాషాను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దపప్పూరు: మతిస్థిమితం లేని మహిళపై అత్యాచార యత్నం చేసిన ఘటనలో నిందితుడు వీరాంజనేయులుని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో స్వల్ప కాలిక కోర్సులు అందుబాటులోకి తెచ్చినట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'టూ వీలర్ సర్వీస్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్' కోర్సులకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తారు. అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తారు. ఆసక్తి ఉన్న పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హతలున్న విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోపు బయోడేటాను ఐటీఐ కార్యాలయంలో అందజేయాలి. పూర్తి వివరాలకు 88868 85173 లో సంప్రదించవచ్చు.

దండం పెడతాం..

మా భూముల జోలికి రావొద్దు!

- ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు పేరుతో భూముల స్వాధీనానికి సిద్ధమైన ప్రభుత్వం
- భూములు వదులుకోబోమంటున్న రైతులు


మా భూముల జోలికి రావద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రాయదుర్గం/బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామ పరిసరాల్లోని సర్వే నంబర్ 328, 332, 340, 341లో సుమారు 80 ఎకరాలకు పైగా ప్రభుత్వ బంజరు భూముల్లో కొన్నేళ్లుగా ఆ గ్రామ రైతులు వర్షాధార పంటల సాగుతో జీవనం సాగిస్తున్నారు. విత్తు నుంచి విపత్తు దాకా ఏ కష్టమొచ్చినా మౌనంగానే భరిస్తూ వచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా భూపంపిణీకి శ్రీకారం చుట్టడంతో నేమకల్లు రైతుల కల సాకారమైంది. ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న 56 మంది రైతులకు 74.78 ఎకరాల భూమికి హక్కు పత్రాలు అందించారు. ఇందులో 80 శాతం దళిత కుటుంబాలతో పాటు చిన్న, సన్న కారు రైతు కుటుంబాలు ఉన్నాయి.

ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో అలజడి

ఇటీవల నేమకల్లు ప్రాంతంలో పర్యటించిన సీఎం చంద్రబాబు అక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని, ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. దీంతో సర్వే నంబర్ 328, 332, 340, 341లో పంపిణీ చేసిన 74.78 ఎకరాల స్వాధీనానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) అధికారులు పరిశీలించి, ఆమోదం తెలిపారు. దీంతో ఆ భూములు ప్రభుత్వానికి స్వాధీనం చేయాలంటూ గత పది రోజులుగా సాగుదారులపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో తమ భూముల జోలికి రావొద్దని రైతులు వేడుకుంటున్నారు. ఒత్తిడి చేస్తే పొలాల్లోనే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బీడు భూములు తీసుకోండి



మా గ్రామంలో బీడు భూములు చాలా ఉన్నాయి. వాటిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. అంతేకాని సాగులో ఉన్న భూములను లాక్కొని రైతుల పొట్ట కొట్టడం సబబు కాదు.

– పరమేశ్వర, సర్పంచ్, నేమకల్లు

చావే గతి



ఈ భూమి లేకపోతే మా కుటుంబానికి చావే గతి. ఉన్న ఎకరం భూమినీ లాక్కోవాలని చూస్తున్నారు. ఎంతో కష్టపడి చదును చేసుకున్నాం. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నాం.

– నాగమ్మ, రైతు, నేమకల్లు, బొమ్మనహాళ్ మండలం

నివేదికలు పంపుతున్నాం



ఇటీవల భూపంపిణీ ద్వారా నేమకల్లు వద్ద రైతులకు అందించిన ప్రభుత్వ భూములు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు ఏపీఐఐసీ నివేదికలు ఇచ్చింది. దీని ఆధారంగా సాగుదారుల వివరాలు పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తున్నాం. సీఎం ఆదేశాలతో ఈ ప్రక్రియ వేగవంతం చేశాం.

–మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

భూమిని వదులుకోం



నిరుపేద దళిత కుటుంబానికి చెందిన మేమంతా ఎనిమిది మంది అన్నదమ్ములం. మాకు పెద్దల ద్వారా సంక్రమించిన ఆస్తులంటూ ఏమీ లేవు. ప్రభుత్వ పంపిణీ చేసిన ఈ భూమినే మా తాతల కాలం నుంచి సాగు చేస్తూ బతుకుతున్నాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ భూమిని వదులుకోం.

– చిన్న వన్నూరుస్వామి, రైతు, నేమకల్లు

వేధింపులు మానండి



చేతులు జోడించి వేడుకుంటున్నాం. మా పేదల భూముల జోలికి రావొద్దు. ప్రతి రాయి ఎత్తి చదును చేసుకున్నాం. ఇందు కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డాం. పంటల సాగుతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. భూముల కోసం అధికారిక వేధింపులు మానుకోవాలి.

– లింగప్ప, రైతు, నేమకల్లు

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో ఎక్కడేగాని చెట్లను తొలగించరాదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అనవసరంగా బ్యారికేడ్లు ఏర్పాటు చేయరాదన్నారు. 14 నియోజకవర్గాల పరిధిలోని ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 10 మంది ఆయకట్టుదారులు, సభకు మూడు వేల మంది మాత్రమే వచ్చేలా చూడాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో గ్రామానికి చెందిన వారు మాత్రమే ఉండాలన్నారు. హెలిప్యాడ్, కాన్వాయ్, సభాప్రాంగణం, తదితర ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు.

బంగారు గొలుసు అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: బస్సులో ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న బంగారు గొలుసును దుండగుడు అపహరించిన ఘటన కళ్యాణదుర్గంలో వెలుగు చూసింది. వివరాలు... కళ్యాణదుర్గం మండలం శిర్పి గ్రామానికి చెందిన మౌనిక, నవీన్ దంపతులు కర్ణాటకలోని పెద్దపల్లి గ్రామానికి వెళ్లేందుకు సిద్ధమై మంగళవారం ఉదయం కళ్యాణదుర్గంలోని బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో వచ్చిన కర్ణాటక ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో పాటు ఎక్కి కూర్చొన్న అనంతరం తన హ్యాండ్ బ్యాగ్‌ను మౌనిక పరిశీలించారు. అందులో ఉంచిన నాలుగు తులాల బంగారు చైన్ కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'కుట్టు'లో భారీ అవినీతి

- రూ.230 కోట్ల టెండర్‌లో రూ.167 కోట్ల స్కామ్
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి


జేసీ శివ్‌నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేసి స్కామ్ గురించి వివరిస్తున్న శ్రీదేవి, నాయకులు

అనంతపురం అర్బన్: మహిళలకు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెరతీసిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆరోపించారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మను మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న, అనంతపురం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బోయ లక్ష్మన్న, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ అహమ్మద్, ఇతర నాయకులతో కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. రాష్ట్రంలో లక్ష మంది బీసీ మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల అందజేత పేరుతో ఒక్కొక్కరికి రూ.23 వేలు చొప్పున రూ.230 కోట్లతో టెండర్‌ను తమకు అనుకూలమైన అవుట్ సోర్సింగ్ వ్యక్తికి కట్టబెట్టారన్నారు. వాస్తవానికి లబ్ధిదారునికి కుట్టు శిక్షణ, మిషన్ ఖర్చు రూ.7,300 మాత్రమే అవుతుందన్నారు. ఈ ప్రకారం మొత్తం లక్ష మందికి గాను ఖర్చు రూ.73 కోట్లు పోను మిగిలిన రూ.167 కోట్లు ఎవరి ఖాతాలోకి మళ్లిస్తున్నారో ప్రభుత్వ పెద్దలే చెప్పాలన్నారు. మొత్తం ఈ స్కామ్‌పై విచారణ జరిపి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళ విభాగం నాయకులు జాహ్నవి రెడ్డి, శోభాబాయి, శోభారాణి, పార్వతమ్మ, అంజలి, భానుమతి, పద్మావతి, లక్ష్మీదేవి, ప్రసన్న, జయమ్మ, లక్ష్మి, కళావతి, నారాయణమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

9 మంది అరెస్ట్

పామిడి: మండలంలోని కత్రిమల గ్రామానికి చెందిన వడ్డె నాగేంద్రపై దాడి చేసి ఆయన మృతికి కారణమైన సుదర్శన్‌రెడ్డితో పాటు మరో 8 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ యుగంధర్ మంగళవారం తెలిపారు. సుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి వర్గీయులు నాగేంద్రపై కట్టెలతో దాడి చేశారన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అనంతపురంలో చికిత్స పొందుతూ మృతి చెందారని గుర్తు చేశారు.

రూ.లక్ష నగదు అపహరణ


నగదు అపహరించుకుని వెళుతున్న దుండగుడు (సీసీ కెమెరా పుటేజీ)

గుత్తి రూరల్: బైక్ సైడ్ బ్యాగ్‌లో ఉంచిన రూ.లక్ష నగదును ఓ దుండగుడు అపహరించారు. ఈ దృశ్యం సీసీ కెమెరా పుటేజీల్లో నిక్షిప్తమైంది. వివరాలు... గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున పంటల సాగు కోసమని గుత్తిలోని కెనరా బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి రూ. లక్ష రుణం తీసుకున్నాడు. ఈ నగదును బ్యాంక్ వద్ద నిలిపిన తన బైక్ సైడ్ బ్యాగ్‌లో ఉంచి ఎదురుగా ఉన్న దుకాణంలో సిగరెట్ కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అయితే అప్పటికే అక్కడ మాటు వేసిన దుండగుడు బైక్ బ్యాగులోని నగదు ఉంచిన సంచిని తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాడు. సిగరెట్ కాల్చి తిరిగి వచ్చిన మల్లికార్జున బ్యాగ్‌లో నగదు కనిపించకపోవడంతో వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బ్యాంకు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తే బ్యాగులోని నగదును తీసుకెళుతున్న వ్యక్తి ఆ వెనుకనే వచ్చిన మరో బైక్‌పై ఎక్కి వెళ్లిపోయే దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించండి

- మంత్రి పయ్యావులకు సచివాలయ ఉద్యోగుల వినతి


మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

అనంతపురం సిటీ: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శుల సమస్యలను తక్షణం పరిష్కరించాలంటూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేసి, మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఇతర విభాగాల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం తమ విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు కూడా పదోన్నతి కల్పించి, న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై మంత్రి పయ్యావుల సానుకూలంగా స్పందిస్తూ.. ఆయా శాఖల మంత్రులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేంద్రరావు, జిల్లా కోశాధికారి మహేశ్ ఉన్నారు.

విషపూరిత ద్రావకం తాగి యువకుడి మృతి

అనంతపురం: మద్యం మత్తులో విషపూరిత ద్రావకం తాగి ఓ యువకుడు మృతి చెందాడు. అనంతపురం నాల్గో పట్టణ సీఐ కనుమూరి సాయినాథ్ తెలిపిన మేరకు... నగర శివారులోని ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన రాజేష్ (20) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం మత్తులో ఇంటికి చేరుకునే క్రమంలో ఓ మద్యం బాటిల్‌ను తన వెంట తీసుకెళ్లేవాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి చేరుకున్న రాజేష్... కాసేపటి తర్వాత మద్యం బాటిల్ అనుకుని చేతికి అందిన బాటిల్ తీసుకుని అందులోని ద్రావకాన్ని తాగేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండడం, ఆ పక్కనే విషపూరిత ద్రావకం బాటిల్ ఉండడం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

315 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా తరలిస్తున్న 315 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా బెంగళూరుకు తరలిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. గార్లదిన్నె తహసీల్దార్ ఈరమ్మ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ అక్బర్ బాషా, క్లీనర్ సుబ్బరాయుడుపై కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని ఆత్మకూరు స్టాక్ పాయింట్‌కు తరలించామన్నారు.

రాప్తాడు: అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియాన్ని రాప్తాడు మండలం మరూరు టోల్ ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. సోమందేపల్లికి చెందిన రవికుమార్ అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి, కర్నాటకలోని పావగడకు తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

కులగణన సక్రమంగా జరిగితే ప్రజలకు సమ న్యాయం

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరా



మడకశిర రూరల్: కేంద్ర ప్రభుత్వం కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తే దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు సమ న్యాయం జరిగే అవకాశం ఉంటుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మడకశిర మండలం నీలకంఠాపురంలో మీడియాతో మాట్లాడారు. కేంద్రం కులగణనపై కార్యాచరణ ప్రకటించాలన్నారు. దాని ఫార్మెట్ తయారీపై అన్ని రాజకీయ పార్టీలతో పాటు లోకసభ, రాజ్యసభల్లో చర్చించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కులగణన సర్వే ఆరు నెలల్లోనే పూర్తి చేసి వివరాలు ప్రకటించాలన్నారు. కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఒత్తిడి తేవడంతోనే కులగణనకు కేంద్రం అంగీకరించిందన్నారు. ఈ సర్వేను తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కులగణన విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేసేలా చూడాలన్నారు. కులగణన పూర్తయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు పెరిగి న్యాయం జరుగుతుందన్నారు.

లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో ఎస్పీ


ఆశీర్వాదం అందుకుంటున్న ఎస్పీ జగదీష్

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామిని ఎస్పీ జగదీష్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి తీర్థప్రసాదాలను, శేషవస్త్రాన్ని అందజేశారు.

అప్పు చెల్లించమంటే దాడి చేశారు!

యల్లనూరు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరిన వ్యక్తిపై రుణ గ్రహీత దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు...యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామానికి చెందిన శ్రీరంగనాయకులు మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నిమ్మకాయల రామాంజనేయులుతో రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాలంటూ సోమవారం రాత్రి శ్రీరంగనాయకులును ఆయన ఇంటి వద్దకెళ్లి రామాంజనేయులు అడిగాడు. దీంతో శ్రీరంగనాయకులు, ఆయన కుమారులు రమేష్, రంగ మహేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రామాంజనేయులుపై ఇనుప పైపులతో దాడి చేశారు. ఘటనలో తలకు తీవ్ర గాయమైన రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్డీటీ పరిరక్షణే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- 17న నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ
- కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రంగయ్య, నేతలు తిప్పేస్వామి, మాదినేని ఉమా


మాట్లాడుతున్న తలారి రంగయ్య, పార్టీ నేతలు

కళ్యాణదుర్గం: జిల్లా ప్రజల జీవనాడిగా, కళ్యాణదుర్గం ప్రాంత ప్రజల గుండె చప్పుడుగా ఉన్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య స్పష్టం చేశారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌తో కలిసి 'సేవ్ ఆర్డీటీ' ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. 'సేవ్ ఆర్డీటీ' పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలకతీతంగా కలిసొచ్చే ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజలతో కలసి ఈ నెల 17న చేపట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్రహ్మసముద్రం నుంచి సెట్టూరు, కుందుర్పి, కంబదూరు మీదుగా కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ కార్యాలయం వరకూ బైకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయాలంటూ ఆర్డీటీకు వినతి పత్రం అందజేస్తామన్నారు. అలాగే సేవ్ ఆర్డీటీ పేరుతో గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకూ పోరాటాలు చేసేందుకు పార్టీ పెద్దలతో సంప్రదించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించనున్నామన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయకుండా సీఎం చంద్రబాబే అడ్డుకుంటున్నారని ఆ సంస్థ ద్వారా లబ్ధిపొందిన గ్రామాల ప్రజలు బాహటంగానే పేర్కొంటున్నారని తెలిపారు. ఆర్డీటీ సేవలు ఆగిపోతే పేదలే తీవ్ర ఇబ్బందులు పడతారనే విషయాన్ని ఈ నెల 9న ఉరవకొండకు రానున్న సీఎం చంద్రబాబును కలసి వివరించి, ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణకు వైఎస్సార్‌సీపీ తరఫున డిమాండ్ చేయనున్నామన్నారు.

సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎన్.వెంకటేశులు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.గంగాధరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా కార్యదర్శి వై.కృష్ణమూర్తి, మున్సిపాలిటీ విభాగం కన్వీనర్ సుధీర్, వివిధ మండలాల కన్వీనర్లు హనుమంతరాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, ఎంపీపీలు అంజినేయులు, నాగరాజు, అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చరణ్, పాతలింగ, భాస్కర్, విజయ్, షెక్షావలి, మురళి, పాండు, అజయ్, ప్రతాప్, రామిరెడ్డి, మల్లికార్జున, కిరణ్ కుమార్, తిమ్మారెడ్డి, సర్పంచులు బాబు, విజయ్, సోమశేఖర్‌రెడ్డి, విరుపాక్షి, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, ఎంపీటీసీ మల్లేశు, నాయకులు శ్రీనివాసరెడ్డి, జానీ, దేవ పాల్గొన్నారు.

గీత కులాల మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

అనంతపురం: జిల్లాలో గీత కులాలకు కేటాయించిన నాలుగు మద్యం షాపులకు టెండర్లు కోరుతూ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారి బి. రామ్మోహన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. గుత్తి రూరల్‌కు గౌడ్, కంబదూరుకు ఈడిగ, డి.హీరేహాళ్‌కు గౌండ్ల, రాయదుర్గం రూరల్‌కు గౌడ సామాజిక వర్గానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలి. నాన్ రీఫండబుల్ కింద దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లలో ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నేరుగా దరఖాస్తులు అందించవచ్చు. 17న లాటరీ ప్రక్రియ చేపట్టి షాపులు కేటాయిస్తారు. పూర్తి వివరాలకు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్లలోని ఆఫీసర్లను సంప్రదించవచ్చు.

ఎన్ఆర్సీలో తాగుబోతు వీరంగం

- గట్టిగా కేకలు వేస్తూ సెంటర్ ముందు పడిపోయిన వైనం
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల వైఫల్యంతో ఆస్పత్రిలో భయాందోళనకరమైన వాతావరణం నెలకొంది. న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్లో ఓ తాగుబోతు హల్చల్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల పౌష్టికాహార లోపంతో ఓ చిన్నారిని అడ్మిట్ చేశారు. ఆ చిన్నారి తండ్రి అర్ధరాత్రి పూటుగా మద్యం సేవించి న్యూట్రీషియన్ రీహాబిలేషన్ సెంటర్కు వచ్చాడు. భార్యతో గొడవ పడి గట్టి గట్టిగా అరుస్తూ..నానా హంగామా సృష్టించాడు. దీంతో ఎన్ఆర్సీతో పాటు అక్కడ చుట్టుపక్కల ఉన్న వార్డులోని గర్భిణులు, బాలింతలు, రోగి సహాయకులు భయపడ్డారు. అక్కడి సిబ్బంది సర్ది చెబుతున్నా..ఎవరి మాట పట్టించుకోకుండా గట్టి గట్టిగా కేకలు వేసినట్లు తెల్సింది. రాత్రి వేళల్లో ఇలా తప్పతాగి ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య అధికమవుతోంది. క్యాజువాలిటీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్నర్సులు, తదితరులపై తాగుబోతులు నోరుపారేసుకున్న సందర్భాలున్నాయి.


ఎన్ఆర్సీ ముందు తప్పతాగి పడిపోయిన వ్యక్తి

రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు ఏం చేస్తున్నారు?

వాస్తవంగా రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు రౌండ్ ద క్లాక్ సర్వజనాస్పత్రిలో ఉండాలి. రాత్రి వేళల్లోనూ వివిధ వార్డుల్లో తిరుగుతూ ఏమైనా సమస్య లుంటే అందుకు తగు చర్యలు తీసుకోవాలి. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో రావడం, సాయంత్రం 4 గంటల వరకు ఉండి వెళ్లిపోతున్నారు. వాస్తవంగా ఆర్ఎంఓలు రాత్రివేళలోనూ అందుబాటులో ఉండాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్కుమార్ అధికారుల విధుల పట్ల కాస్త దృష్టిసారిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

ఆకలి కేకలు నిజమే..

- అధికారుల తనిఖీలో బట్టబయలు

అనంతపురం మెడికల్: 'ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్(ఎన్ఆర్సీ)లో ఆకలి కేకలు వాస్తవమేనని ఆస్పత్రి అధికారుల తనిఖీలో తేలింది. మంగళవారం సాక్షిలో 'చిన్నారుల ఆకలి కేకలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ డాక్టర్ వినోద్కుమార్ ఆదేశాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి ఎన్ఆర్సీని తనిఖీ చేశారు. ప్రధానంగా ఎన్ఆర్సీలో వంట మనిషి అందుబాటులో లేరని, అక్కడున్న స్టాఫ్నర్సులు, తదితరులే వంట చేస్తున్నట్లు నిర్ధారణైంది. ఇద్దరు చిన్నారులను పరీక్షించగా అందులో ఒకరు డైట్ ఆలస్యం కావడంతో ఆశించిన స్థాయిలో బరువు పెరగనట్లు అధికారుల తనిఖీలో వెలుగుచూసింది. ఎన్ఆర్సీలో వంట గది పైకప్పులో పెచ్చులూడుతున్నట్లు, ఉన్న రెండు ఏసీలు పని చేయడం లేదని గుర్తించారు. ఎన్ఆర్సీ నిధులు రూ.లక్షల్లో ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సెంటర్లో మౌళిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


ఎన్ఆర్సీని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

అనంతపురం కార్పొరేషన్: కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నగరపాలక సంస్థ ముందు వారు ధర్నా చేపట్టారు. అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు 10 నెలలు కావొస్తున్నా కారుణ్య నియామకాలు చేపట్టలేదన్నారు. అదనపు కార్మికులకు రూ.15,000 ఇవ్వాలని, నగర జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. సమస్యలకు పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఈ నెల 20 నుంచి 22 వరకూ సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. నాయకులు వెంకటనారాయణ, నాగరాజు, తిరుమలేసు, లక్ష్మీనరసమ్మ, రాఘవేంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ ముందు ధర్నా చేస్తున్న మునిసిపల్ కార్మికులు

దోచుకోవడం కూటమి ప్రభుత్వ నైజం

అనంతపురం కార్పొరేషన్: ప్రజల సొమ్మును దోచుకోవడమే కూటమి ప్రభుత్వ నైజమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి ధ్వజమెత్తారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళా దినోత్సవం రోజున కుట్టు మిషన్ల పంపిణీ, శిక్షణ పేరుతో రూ.వందల కోట్ల స్కాం చేయడం దారుణమన్నారు. మహిళా సాధికారత అంటే ఇదేనా సీఎం చంద్రబాబు అని ప్రశ్నించారు. తొక్కో లబ్ధిదారుకు రూ.23 వేలు కేటాయించారని, అందులో ఒకరికి రూ.7,300 మాత్రమే ఖర్చు అవుతుందని, ఇలా రూ.167 కోట్లకు మింగేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారత దిశగా అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటే..కూటమి ప్రభుత్వం మహిళ పేరుతో వారికి చెందాల్సిన డబ్బును దోచుకోవడం దారుణమన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు. మహిళా విభాగం నేతలు జాహ్నవిరెడ్డి, శోభాబాయి, శోభారాణి, పార్వతమ్మ, అంజలి, భానుమతి, పద్మావతి, లక్ష్మీదేవి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ మహిళా విభాగం నేతలు

ఘనంగా రేణుకా యల్లమ్మ శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: పాతూరులో చంద్రగుత్తి రేణుకా యల్లమ్మ తల్లి మహోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ఆరంభమయ్యాయి. గోసల వంశస్తులు జలధి పూజలో భాగంగా కొత్త వెండికాగుతో అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గోసల లక్ష్మణ్ణ మాట్లాడుతూ బుధవారం ఉదయం 6 గంటల నుంచి సాక మహోత్సవం సాగుతుందని మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా పాతూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆరాధన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆరాధన ఉత్సవం పెద్ద ఎత్తున జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గోసల వంశస్తులు

ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత

- భారీ శోభాయాత్రకు సన్నాహాలు
- ముస్తాబైన ఆలయాలు

సందర్భం
నేడు వాసవి జయంతి

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత, లోకపావని వాసవీమాత జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. దివ్య మనోహర రూపం, కరుణాకటాక్ష వీక్షణాలతో భక్తులను అనుగ్రహిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి అత్యంత ఫలప్రదమని భక్తులు విశ్వసిస్తారు. ఆర్యవైశ్యులనేకాక యావన్మందికి సిరి సంపదలొసగి సుఖశాంతులతో జీవించే భాగ్యం కలగజేసే వాసవీ అమ్మవారి జయంతి అనంతపురం జిల్లా కేంద్రంతో పాటూ హిందూపురం, ధర్మవరం, కదిరి, తాడిపత్రి ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా అనంతపురంలో ప్రధానమైన కొత్తూరు అమ్మవారి శాల ముఖద్వారం జయంతి వేడుకలకు స్వాగతం పలుకుతున్నట్లు అలంకరించారు. పాతూరు, కొత్తూరు అమ్మవారి శాలల ద్వారా సేవా తత్పరతగల విధులను నిర్వర్తిస్తూ ఆర్యవైశ్య సంఘాలు తరిస్తున్నాయి.

ఆసక్తికరమైన చరిత్రాత్మక నేపథ్యం

పూర్వం ముగ్ధ మనోహర రూపంలో జన్మించిన వాసవి కన్యకను ఆ ఊరి రాజు చూసి మోహిస్తాడు. పెళ్లి చేసుకుంటానని చెరబడతాడు. ఆదిశక్తి స్వరూపిణి అయిన వాసవీ మాత రాజుకు దక్కకుండా ఆత్మార్పణ చేసుకుంటుంది. ఆనాటి నుంచి ఆర్యవైశ్యులను కంటికి రెప్పలా కాపాడుతున్నదన్నది పురాణ నేపథ్యం. ఆ చరిత్రను ప్రతిబింబిస్తూ వైశ్య పెనుకొండ మహాపుణ్యక్షేత్రాన్ని తలపిస్తూ నగరంలో పాతూరులో 1948లో సుందరమైన వాసవీమాత ఆలయాన్ని నిర్మించారు. నగరం దినదినాభివృద్ధి జరిగి పెరిగిపోవడంతో 1951లో కొత్తూరు ప్రాంతంలో మరో వాసవి ఆలయాన్ని నిర్మించారు. తొలుత ఇవి ఆర్యవైశ్య సంఘాలుగా, సత్రాలుగా ఏర్పడి అనంతరం ఆలయాలుగా అంతర్భాగమై విరాజిల్లుతున్నాయి. ఆర్యవైశ్య సంఘాలు వాసవి మాత ఆదేశానుసారం వివిధ సేవా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్నారు. జాతి పిత మహాత్మాగాంధీ నిలువెత్తు విగ్రహాన్ని, అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాలను టవర్క్లాక్ సమీపంలో ఏర్పాటు చేసుకుని జయంతి వర్ధంతుల నాడు ఘనంగా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.


వాసవీమాత ఆలయ ముఖద్వారం

నేడు వైభవంగా జయంత్యుత్సవాలు

వాసవీ జయంతి సందర్భంగా పాతూరు, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు అమ్మవారితో శోభను సంతరించుకున్నాయి. విద్యుద్దీపకాంతుల నడుమ వాసవీ ఆలయాలు ప్రత్యేక పూజలకు సిద్ధం చేస్తున్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు వైశ్యాహాస్టల్ నుంచి ప్రాచీన కళారూపాలతో భారీ ఊరేగింపు ఉంటుంది. 9.30 గంటలకు వాసవీ హోమం, మధ్యాహ్నం అలంకార, అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని అమ్మభక్తులందరు తరలి రావాలని కొత్తూరు అమ్మవారి శాల అధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు, పాతూరు అమ్మవారి శాల అధ్యక్షులు పిన్ను నాగరత్నం కోరారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని అశోక్నగర్లో ముస్లిం శ్మశానవాటికలో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.67 లక్షలతో చేపడుతున్న ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్తో కలసి మేయర్ వసీం మంగళవారం భూమి పూజ చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో అన్ని మతాల శ్మశాన వాటికల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. శ్మశాన వాటికల్లో శుభ్రతతో పాటు రూ.15 లక్షలతో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. నవోదయ కాలనీ శ్మశాన వాటికలో రూ.43 లక్షలతో అంతర్గత రోడ్లు, హెచ్ఎల్సీ కెనాల్ శ్మశానవాటికకు రూ.43 లక్షలతో ప్రహరీ పనులు చేపట్టామని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ పండుగలకు శ్మశాన వాటికల్లో శుభ్రత, లైటింగ్, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, వక్ఫ్బోర్డు మాజీ జిల్లా చైర్మన్ కాగజ్ఘర్ రిజ్వాన్, ముతవల్లి షకీల్షఫీ, కార్పొరేటర్లు కమల్భూషణ్, రహంతుల్లా, ఇషాక్, వైఎస్సార్ సీపీ నాయకులు మహబూబ్బాషా, దాదాఖలందర్, గుల్జార్ పేట ఖాజా, ఖాదర్, హుస్సేన్ పీరా, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ వసీం

విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా సంస్థల విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంతునాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే అడ్మిషన్లు చేపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఫీజు నియంత్ర కమిటీని ఏర్పాటు చేసి ఫీజుల వసూళ్లను నియంత్రించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహ యాదవ్, వెంకట్ నాయక్, చందు, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాని పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యా మాఫియాకు అడ్డుకట్ట వేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ యాజమాన్యాలు సాగిస్తున్న విద్యా మాఫియాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ), బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్చేశారు. అనంతరం డీఈఓ ప్రసాద్బాబుకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎబీ నాయకులు విజయ్, మధు, మనోహర్, వంశీ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 77ను రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీఓ 77ను రద్దు చేయకుండా ఐసెట్ నిర్వహిస్తే అడ్డుకుంటామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు హెచ్చరించారు. మంగళవారం ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక తెలుగు తల్లి విగ్రహం ముందు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారిన జీఓ 77ను రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేష్ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఒక విద్యా సంవత్సరం ముగిసిందన్నారు. లోకేష్ హామీ నెరవేర్చకుండా విద్యార్థులకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఈ ఏడాదికి సంబంధించి నిర్వహించబోయే ఐ-సెట్ పరీక్షను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్, విజయ్, మోహిత్, ప్రశాంత్, భూతరాజ్ పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

అనంతపురం: పీజీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేస్తామని , జీఓ నెంబర్ 77ను రద్దు చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చిన నారా లోకేష్ విస్మరించారని ఏబీవీపీ నాయకులు విమర్శించారు. జీఓను రద్దు చేయకపోతే ఏపీ ఐసెట్ పరీక్షను అడ్డుకుంటామని హెచ్చరించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం నిరసన వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కో-కన్వీనర్ వనవాసి దివాకర్నాయక్, బాబు, జి, భానుప్రకాష్, రాజేంద్ర, నరేంద్ర, హరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పరిశుభ్రతతో ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్వైజర్ జయశ్రీ

అనంతపురం రూరల్: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్వైజర్ జయశ్రీ, సర్పంచ్ ఆశాబీ అన్నారు. మంగళవారం రాజీవ్ కాలనీ పంచాయతీలోని సచివాలయం-1లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కిశోర బాలికలు పోషకాహారాన్ని తీసుకుంటేనే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. అంగన్వాడీ సిబ్బంది వరలక్ష్మి, నాగవేణి, నిర్మల, షాహిన్తాజ్, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదాం


బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆత్మకూరు: సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పంపనూరు గ్రామంలో కిశోర వికాసం, బాల్య వివాహాల నిషేధ చట్టంపై వివరించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని హెచ్చరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగే సమాచారం ఉంటే వెంటనే అంగన్వాడీ కార్యకర్తకుగాని, మహిళా పోలీసులకు గాని వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ లావణ్య, శ్రీవాణి, ఈఓ బాబు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం


గుండె పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: స్థానిక పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో కిమ్స్, సవీరా ఆసుపత్రి వారు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, కంటి తోపాటు వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు వన్నూరప్ప, అతిక్రెడ్డి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలి


సీహెచ్ఓ శివ ప్రసాద్కు వినతి పత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

రాప్తాడు: ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఆశా కార్యకర్తలు స్థానిక పీహెచ్సీ దగ్గర ఆందోళన చేపట్టి ఈ నెల 20న జరగబోవు దేశావ్యాప్త సమ్మె నోటీసును సీహెచ్ఓ శివప్రసాద్కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేసి, కార్మిక చట్టాలను పటిష్ట పరచాలన్నారు. ఆశా కార్యకర్తలకు రూ.26 వేలు కనీస వేతనం మంజూరు చేసి, కార్మికులుగా గుర్తించి, పర్మినెంట్ చేయాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించి, ఒప్పంద జీఓలు ఇవ్వాలన్నారు. ఆరోగ్య రంగానికి జీడీపీలో 6 శాతం నిధులు ఇచ్చి, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపి ప్రజా సంపదను కాపాడాలన్నారు.

పేదల బతుకుల్లో వెలుగు రేఖ ఆర్డీటీ


మాట్లాడుతున్న అనిల్కుమార్

అనంతపురం టవర్క్లాక్: పేదల బతుకుల్లో ఆర్డీటీ వెలుగు రేఖ లాంటిదని సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు అనిల్కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా ఫెర్రర్ విగ్రహం వద్ద అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపటిన రిలేనిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా అనిల్కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పేదల అభ్యున్నతికి ఫాదర్ ఫెర్రర్ ఎనలేని కృషి చేశారన్నారు. అలాంటి సంస్థకు నిధులు రాకుండా ఆపేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్సీఆర్ఏ రిజిస్ట్రేషన్ను రెన్యూవల్ చేయాలన్నారు. సాకే హరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ నిధులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంఘాల నేతలు శ్రీరాములు, గంగన్న, రవి, విజయభాస్కర్, వన్నూరప్ప, ఆదినారాయణ, ఓబులేసు, సుగమంచి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, టీవీ రెడ్డి, గోవర్ధన్, రామకృష్ణ, దేవి, రాజమ్మ, నిర్మల, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు

- వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శింగనమల నియోజకవర్గ నేతలు

అనంతపురం కార్పొరేషన్: పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానంతో మంచి గుర్తింపు వచ్చేలా చూస్తామని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శింగనమల నియోజకవర్గానికి చెందిన బీకేఎస్ మండల నాయకుడు ముసలన్నతో పాటు పలువురు అనంతను ఆయన నివాసంలో సన్మానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అనంత వారికి సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా వైఎస్సార్సీపీ శ్రేణులే లక్ష్యంగా దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం

అనంతపురం మెడికల్: సూపర్స్పెషాలిటీ ఆస్పత్రిలో సప్తగిరి క్యాంఫైర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. రోగుల సౌకర్యార్థం వివిధ స్వచ్ఛంద సంస్థలు 25 వీల్ చైర్లు, 50 ఆఫీస్ చైర్లు, 2 ఎయిర్కూలర్లు అందజేశాయి. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, గ్రేడ్ - 1 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి డీవైఈఓను కలిసిన ఎంఈఓ-2 సంఘం నేతలు


మల్లారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ-2 అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ గుత్తి డివిజన్ డెప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీవైఈఓ)గా అదనపు బాధ్యతలు స్వీకరించిన బెళుగుప్ప ఎంఈఓ పాటిల్ మల్లారెడ్డిని ఎంఈఓ-2 సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీవైఈఓ మల్లారెడ్డిని ఏపీ ఎంఈఓ-2 అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు గురు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు భవాని శంకర్, ఓబుళపతి కలిసి శాలువా కప్పి సన్మానించారు.

మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి


ఎస్కేయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న రామచంద్ర

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయం పరిధిలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్.రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్కేయూ ఇంచార్జ్ వీసీ ప్రొఫెసర్ అనితకు వినతి పత్రం అందజేశారు. వర్సిటీ పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఆర్పీఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జీవీ ఉజ్వల్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ డీఈఈగా జింకల కృష్ణజ్యోతి



అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ అనంతపురం సబ్ డివిజన్-2(శింగనమల నియోజకవర్గం) డీఈఈగా జింకల కృష్ణజ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ) బాలూ నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో అభివృద్ధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఈ నియోజకవర్గం ఇప్పుడు పూర్తిగా వెనుకబడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణజ్యోతికి డీఈఈ బాధ్యతలు అప్పగించాల్సి వచ్చిందని పంచాయతీరాజ్ వర్గాలు తెలిపాయి. తక్షణం బాధ్యతలు చేపట్టాలని ఈఎన్సీ ఆదేశించినట్లు సమాచారం.